# జైలు కథలు 18

## హంతకి

రాము, నేను బ్లాక్ బయట వరండాలో కారమ్స్ ఆడుకుంటున్నాము. రేషన్ ఇన్‌ఛార్జి బాలయ్య వచ్చాడు "ఏమిటి? విషయం" అన్నాను నవ్వుతూ. "నాకు తెలియదు. జైలర్ రమ్మంటున్నారు" సీరియస్‌గా అన్నాడు. వెంటనే లేచి ఆఫీస్‌వేపు వెళ్ళాను. జైలర్ కూడా చాల సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు. స్టూలుపై కూర్చోమని నాకు చేత్తోనే సైగచేశారు. సీలింగ్‌ఫాను శబ్దంతప్ప మరేం వినిపించటం లేదాగదిలో. ఆయనేం అడగలేదు. అడిగే ధైర్యం నాకు లేదు. తల గోక్కుంటూ వుండటంవల్ల, ఏదో విషయంపై తీవ్రంగా ఆలోచిస్తున్నా రనుకున్నాను.

"మగవానికికూడా శీలం వుండాలంటావా? ప్రసాద్" నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అడిగారు. "అవును" అన్నాను నాకు విషయం అర్థంకాకపోయినా. "రాధా" అన్నారాయన. ప్రక్కనేవున్న గదిలోనుంచి వచ్చిందామె. వయసు ముప్పయి సంవత్సరాలు వుండవచ్చు. మంచి విగ్రహం. చూపరులను యిట్టే ఆకర్షిస్తుంది. నా దృష్టి మరల్చి జైలర్ గారివేపు తిరిగాను. "లిజన్ హర్" అని మళ్ళీ ఆలోచనలో మునిగిపోయారాయన.

* * *

రాధ నిజంగా రాధే. ఆమె ప్రియుడు వేణు గానలోలుడు కాకపోయినా పేరు మాత్రం గోపాల్. ఇంటి ప్రక్క యిల్లు. యిళ్ళు కలసిలేకపోయినా మనసులు మాత్రం కలుసుకున్నాయి. యిక ఆలస్యం భరించలేక శరీరాల్ని కూడా కలిపేశారు. కాని పాత పగలువున్న పెద్దవాళ్ళను మాత్రం కలుపలేకపోయారు. గోపాల్ బి.కాం. పూర్తి చేశాడు. రాధ యింటర్ అయిం తరువాత టైపు, షార్ట్‌హేండ్ చేసింది పెద్దల బెదిరింపులకు, సాధింపులకు స్థానం యివ్వకుండా ప్రేమ పక్షులై ఎగిరి హైదరాబాద్‌లో వాలారు. గోపాల్ ఫ్రెండ్ మదన్ వీరికి చక్కని ఆతిధ్యం యిచ్చాడు. మదన్ ఆల్విన్‌లో మెకానికల్ సూపర్‌వైజర్‌గా వుంటున్నాడు. భార్య రీటా పెద్ద లాడ్జిలో టెలిఫోన్ ఆపరేటర్‌గా వుంటుంది. పిల్లలు లేరు. యిద్దరి సంపాదనతో కాలం తెలీకుండా గడిచిపోతూంది. మొదటినుంచి రాధ చాలా ఖచ్చితమైన అభిప్రాయాలు కలిగి వుంది. పరస్త్రీ, లేక పరపురుష వ్యామోహం-ఆమె దృష్టిలో క్షమించరాని మహాపరాధం. శీలం అనేది స్త్రీకి ఎలాగో, అలాగే పురుషునికీ ముఖ్యం అంటుంది. సమాజంలో స్త్రీ పతనానికి పురుష అహంకారమే కారణమంటుంది. ఇతర వ్యామోహం, కేవలం పశుప్రాయం అని ఆమె అభిప్రాయం.

మదన్‌ను అన్నయ్యా అని, రీటాను వదినా అని సంబోధించేది. రీటా కూడా గోపాల్, రాధలను అలాగే సంబోధించేది. రాధకు మదన్ ద్వారా ఆల్విన్‌లో స్టెనో టైపిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది. అలాగే



రీటా ఆమె పనిచేసే లాడ్జిలో గోపాల్‌కు రిసెప్షనిస్ట్‌గా యిప్పించింది. అంతా ఒకే ఇంట్లో వుండేవారు. కాలం ఎలాంటి వొడుదుడుకులు లేకుండా గడిచిపోతూంది. యిప్పుడు రాధ ముగ్గురు బిడ్డల తల్లి. బుజ్జి, బుల్లి, చంటి ముగ్గురూ ఆడపిల్లలే.

ఆ రోజు రెండవ శనివారం రాధ, మదన్ యింటి వద్దనే వున్నారు. రీటా, గోపాల్ డ్యూటీకి వెళ్ళారు. వారికి శలవు లేదు. మొదటి ఆట సినిమాకు వెళ్ళటం కోసం గోపాల్‌ను త్వరగా యింటికి రమ్మంది. గోపాల్‌కు అయిదు గంటలకు డ్యూటీ అయిపోతుంది. తనకు కొద్ది పని వుండటంవల్ల రాలేనని, పిల్లలను తీసికొని వెళ్ళమని చెప్పాడు గోపాల్. రాధ, పిల్లలు సినిమాకు బయలుదేరారు. రాధ సినిమాకు వెళ్ళే దారిలోనే వుంది గోపాల్ పని చేసే లాడ్జి. లాడ్జి బయట రిక్షాఆపి పిల్లలను అందులోనే వదలి, వొంటిగా లోపలకు నడిచింది. కౌంటర్‌లో గోపాల్ లేడు. డ్యూటీలోవున్నతన్ని అడిగింది. రెస్ట్‌రూంలో వున్నట్టు చెప్పాడు.

"డోన్ట్ డిస్టర్బ్" బోర్డువున్న రెస్ట్‌రూం తలుపు మెల్లగా తోసింది లోపలి దృశ్యం...!

రిక్షాను యింటివేపు మరల్చింది. తల్లి మౌనం పిల్లలకేమీ అర్థంకాలేదు. ఆలోచనలతో సతమత మౌతూంది. "అయితే నా సంతానం శీలంలేని వాడికి కలిగిన సంతానమా? అలాంటివానికి కలిగిన సంతానం శీలంగా వుండగలరా? వాళ్ళు చేసేపనులకు తల్లిగా నన్ను నిందించకూడదు లోకం. మరి.... మరి.... అన్నయ్యా అని పిలుస్తున్న రీటా. 'అన్న' పదానికి అర్థం మరచి... శరీరాన్ని ఎలా అర్పించగలిగింది. లోకం అంతా బూటకం. అంతా మాయ, మోసం" తల బ్రద్దలౌతూంది. నిగ్రహం కోల్పోయింది.

పిల్లలకు విషప్రయోగంచేసి, తాను తీసికొంది. వైద్యం జరిగిన తరువాత, చిన్న పిల్లలిద్దరూ చనిపోయారు. పెద్దపిల్ల, రాధ బ్రతికారు

"రేపు తీర్పు ప్రసాద్! ఎలావుంటుందో?" ఆమె వంక అభిమానంగాచూస్తూ అన్నారు జైలర్ ఆమె కనుకొలకుల్లో నీటి బిందువులు గమనించాను.

రెండవ రోజు సాయంకాలం కోర్టుకు వెళ్ళినవారు ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తున్నాను. కోర్టునుంచి అందరూ వచ్చిన తరువాత జైలర్‌గార్ని కలుసుకొని "రాధ తీర్పు ఏమైంది సార్?" అన్నాను ఆత్రుతగా. నావంక నిర్లిప్తంగా చూసి, రాధ సమన్ నాచేతి కిచ్చారు.

చదివిన తరువాత నా గుండె బాధగా మూలిగింది. "బిడ్డలను హత్య చేసినందుకు 302 సెక్షన్ క్రింద యావజ్జీవ శిక్ష, కుమార్తె హత్యా ప్రయత్నానికి 307 సెక్షన్ క్రింద రెండు రెండు సంవత్సరాల కఠిన కారాగారవాసం, ఆత్మహత్యా ప్రయత్నానికి 309 సెక్షన్ క్రింద ఎనిమిది నెలల జైలు శిక్ష" తీర్పు ఖచ్చితంగావుంది. అలాగే మనుషులుకూడా ఖచ్చితంగావుంటే యిలాటి పరిస్థితులు రావుకదా! అనుకున్నాను.

—"ప్రసాద్"